# ఒకటే చీర

"నీవు తిని వచ్చిన తరువాత నే బోయి తినివత్తునుగాని, ముందు నీవేఁగి తినిరా; చీఁకటి పడినను నాకు భయములేదు" అని అత్తయనెను.

అచ్చరనయినను పిశాచముగా! జేసివైచు కోక కట్టుకొని కూర్చున్న కోడలొక్క నిమిష మాలోచించి – "కాదు కాదు, మీరే ముందు వెళ్ళ వలయును. మీరు వచ్చిన తరువాతనే నేను" అని యనెను.

"మానమును మరియాదయు ఎక్కువ వారికిఁగాని మముబోఁటి తక్కువ వారికిఁ గావమ్మా! కాబట్టి ఆ సంగతి వదిలిపెట్టు! నీకు మధ్యాహ్నము కూడ కూడులేదు. పైఁగా చిన్నదానవు! చీఁకటిలో ఆ గుంపులో త్రోసికొని వచ్చుటయు ప్రమాదము" అని అత్త యనెను.

"మానమును మరియాదయును గాలియు నీళ్ళవంటి వత్తా! తండ్రియును, కొడుకును తిని పదకొండు గంటలకే నాగరాజుగారి యింటికి వెళ్ళిరి గదా! మీకు మాత్రము మధ్యాహ్నము కూడేది? కాఁబట్టి ముందర మీరే వెళ్ళిరండు; తరువాతనే నేను వెళ్ళుదును. చీఁకటయనియు, గుంపనియు నాకొక దయ్యము చూపితిరి. దయ్యములు నన్నుఁజూచి పారిపోవును" అని కోడలనెను.

"కాదమ్మా! నీకు పచ్చపసుపు పోసినటులు, మెఱుపులు ముద్దచేసినటు లుందువు; నీకు దృష్టి తగులునమ్మా! మఱి చెప్పను."

"మీ మాటయే నిజమగుఁగాక! మెఱుపులు ముట్టినచో దెబ్బతగులు నత్తా! దానికేమిగాని ముందు మీదే వంతు."

కోడలు మిగుల వినయవిధేయతలు కలది. అత్తమాట కెన్నఁడు నెదురాడి యెఱుఁగదు. ఆడుచో మఱి వింధ్యపర్వతమే. ఈ సంగతి ఆ యత్తకు తెలియును. కాఁబట్టి యిఁక లాభము లేదనుకొని అత్త తన అతుకులబొంత విడిచి అటకమీఁది చీరతీసి కట్టుకొని నాగరాజుగారి సత్రమునకు వెళ్ళెను.

ఆ బస్తీలో నెటుచూచినను నాగరాజు పేరే! నాగరాజు ఆసుపత్రి! నాగరాజు అనాథశరణాలయము; నాగరాజుదేవాలయము; నాగరాజుకాలేజి! నాగరాజు సత్రము;

నాగరాజు కొళాయి; నాగరాజు వీధి : – వీధి? వీధి యేమి కర్మము? ఇఁక ఆ బస్తీ బస్తీ నాగరాజుపురమై పోవచ్చును.

నాగరాజిపుడు పేదవారికి జావపోయుట కొక సత్రమారంభించెను. ప్రతిదినము సాయంకాల మాఱుగంటలకు నాంది. పదిగంటలకు భరతవాక్యము. కష్టపడి సంపాదించు కొనువారు గూడ నిటఁ దినమరఁగి సోమరులయిపోదురను సదుద్దేశముతోడనే యిపుడతఁడు నూకలజావ పోయుట కేర్పాటొనరించెను. కష్టపడి సంపాదించుకొనఁ గలవారి కీ నూకలజావ తినుట అవమానమని అతని ఉద్దేశము. సోమరితనమును అవమానమును అన్నదమ్ములని యతఁడెఱుగఁక పోవచ్చును.

రోడ్డుల కిరుప్రక్కలనున్న మురికికాలువల నీరు తగులకుండ జనులు కదు జాగరూకతోఁ గూర్చుండిరి. దుమ్ములేవకుండ రోడ్లమీఁద నీరు కొట్టిరి. నాగరాజు అండ్ సన్సువారి బియ్యపుమరయందును, పిండిమరయందును, నూనెమరయందును, పంచదార మరయందును, పనిచేయు వారెందరో వచ్చి విస్తళ్ళువేయఁదొడిగిరి. నాగరాజును, అతనికొడుకు గంగరాజును బంతులవెంటఁ దిరుగుచు అజమాయిషీ చేయుచుండిరి. కొందరు పచ్చడియు మఱికొందఱు ఉప్పును వేసికొనుచుఁ బోవుచుండిరి. తరువాత నూకలజావ వచ్చెను. అది పేరునకు జావ. అర్థమునకు జాఱుముద్ద.

దరిద్రనారాయణు లందఱును దంత యంత్రములు విప్పిరి. "ఇఁక నొక యేడాది వఱకును తిండిలేక చావ" మను ధైర్యము వారి మొగములలోఁ గనఁబడుచుండెను. గ్రుడ్డి వారందఱును నాగరాజును చూడవలయుననియు, కుంటివాండ్రందఱును నాగరాజు ముంగలికి పరువెత్తి జేపెట్టవలయుననియుఁ దలచుచుండిరి. అంగవైకల్యములేని వారందఱును నాగరాజును, అతని కుమారుఁడును తమ నడుమనుండి పోవుచుండగా తలలు వంచుకొనుచుండిరి.

తన యింటిచుట్టును నలువైపులనున్న రోడ్లనడుమ నడుచుచు, ఈ దరిద్ర నారాయణులఁ జూచుచున్న నాగరాజు హృదయము బరువెక్కెను. శిల్పసంపదలతో, రసపురుషుని దెలుపు తన పాలరాతిమేడ చుట్టునుకూర్చున్న ఈ జీవచ్ఛవములను జూచుచున్న నాగరాజుకు సృష్టిచేయు బ్రహ్మకి విశ్వమునిండ శవములు కనిపించుచో నెటులుండునో యటులుండెను. అతఁడు వడివడిగా ఆ రోడ్డుదాఁటి యెడమవైపు రోడ్డుమీఁదికిఁ దిరిగెను.

అచట బంతులన్నియు పూలమొక్కలు పాతిన చందముగా నుండెను. అతనికంటికిఁ గొంచెము శాంతి దొరకెను. నడుచుచు నడచుచు నున్నవాఁడచట నాఁగి యచటఁ గూరుచున్నవారి నందఱను పరికించెను. పలువురు తన మిల్లులలో పనిబాగులవారే.

"వీరుం గూడ నిచటికేల వచ్చిరి?" అని యతండనుకొనెను. ఇంక నిలిచినచో బాగుండదు. వారందఱాడువాండ్రు! అతండు మెలమెల్లగా పదియడుగులు నడచెను. అచట వింతతోడను వెగటు తోడను అతండాగిపోయెను - మాతరమ్మ! ప్రతిదినమును తన యింటికి పాలు తెచ్చియిచ్చును, బియ్యపు మరలో కూలిది!

మాతరమ్మ జావముద్ద తినుచున్నది! అతండాచి చూచెను. మాతరమ్మయుం జూచెను. ఆమెలో నెక్కడేని యేమాత్రమేని సందియము లేదు. తన హక్కును తాను వృథాచేయకుండ వినియోగించుకొనుచున్న చందముగా తినుచు లోలోపల నాగరాజునకు మ్రొక్కుచున్నది. కొడుకును బిలిచి సరిగా వినియోగము చేయింపుమనిచెప్పి నాగరాజు మేడలోనికి వెళ్ళిపోయెను.

"అప్పుడే వచ్చితి రేమి? దరిద్రనారాయణసేవ సమాప్తమా?" యని యతని భార్య యోగమాయ ప్రశ్నించెను.

"ఇది సేవకాదు, పరీక్ష."

"నారాయణునికి పరీక్షయా?"

"ఆఁ. దరిద్రనారాయణ పరీక్ష. ఈ గుంపులో మన మిల్లుల పనివాండ్రు కూడ పలువురు దూఱిరి. వారి కేమిరోగము? వారిలోనొకొక్కతె ఎటువంటి చీరకట్టుకొని వచ్చినదో యొకపరిచూడు! వైస్రాయి విందుకు వచ్చినట్లు! మాతరమ్మయు వచ్చినది; నీవు కూడ అంత విలువగల కోక కట్టవు. నీ వెప్పుడో అట్టికోక కట్టినటులు గుఱుతు?

యోగమాయ కొంచెము సిగ్గుపడియిటులనెను - "సరిసరి. మాతరమ్మయు నామెకోడలు జయయు, ప్రతిదినమును మిల్లుకు వచ్చుచు దగ్గఱ ఉండి పాలు పిండించి మనకుం దెత్తురు. ఒకనాడు నేనే పాలగిన్నె తీసికొనవలసి వచ్చెను. ఆమెను చూతునుగదా గుడ్డలమ్మ! బీరువా తీయగనే ఒకచీర కనంబడెను. అది కట్టించి ఆమెనపుడు మిల్లుకు పంపితిని. వాండ్లు చాలా మంచివాండ్లు!"

"మంచివాండ్లగుచో నిక్కడి కేలవత్తురు? పేదలకు సత్రముగాని వీరికా? వీరికి మనము జీతములిచ్చుట లేదా?"

"ఏ మిచ్చుచున్నారు?"

"నాకు గురుతా? గుమాస్తా నడుగు."

"మీ రిచ్చునది తమకుం జాలినచో మాతరమ్మ చచ్చినను సత్రమునకు రాదు."

"ఆడువాండ్రు మీఁద నీ కభిమానము"

"ఒకవేళ నున్నచో అది మీరనుకొననటులు తప్పుకాదుగాని, మీరిచ్చు జీతము వారి కుటుంబమునకుఁ జాలదు. అది యటులుండుగాక. నాకుఁ గూడ మీ సత్తరువున వారితోపాటు తిని రావలయునని సంకల్పము కలుగుచున్నది."

"ఏమేమి?"

"ఇపుడొకఁ డీ దరిద్రులకు ప్రతినిధిగా మోకాలు దిగని కొల్లాయ కట్టుకొను చుండఁగా నేనొక యేఁడాదిపాటు దరిద్రుల దుఃఖమెంతయో కనుగొనుటకు నూకలకూడు తినజాలనా? అదియుఁగాక కాయకష్ట మొనరించి మన సంపదలోఁ గొంతుకుఁ గానున్నను గొంతుకు కారణమైన మన యీ కూలివాండ్ర తరువాతనే యీ దరిద్రులు. మన గుమాస్తాల తరువాతనే యీ దరిద్రులు."

హేతుపూర్ణమైన యీ వాక్ ప్రవాహపు టురవడికి నాగరాజు మనస్సు చాల దవ్వు కొట్టుకొని పోయెను.

సరిగా ఆ సమయమునకు మాతరమ్మ వారిముందరికి వచ్చి కొంచెము వెనుకకుఁ దగ్గి తలుపుచాటున నిలుఁచబడెను.

నాగరాజు కొంచెము బిడియపడి మేడమీదికి పోబోయి గదిలోనికి మరలెను.

"కోడలిని దీసికొని రాకుండ నీ వొక్కతెవే వచ్చితివేమి?" అని యోగమాయ అడిగెను. "చీర్‌ర్..." అని ఆగిపోయి కొంచెము సిగ్గుపడి వేదన ననుభవించి మాతరమ్మ మరల నందుకొని "మేమిరువురమును వచ్చుచో నింటికాపెవరు? నేను వెళ్ళుచునే పంపెదను. దానికి మధ్యాహ్నము కూడ కూడులేదమ్మా!" అని యనెను.

"సరి.నాకుఁ గనపడిపొమ్మని చెప్పు?"

"నేను చెప్పనక్కఱలేదు. దానికిఁ దెలియును" అనుచు మాతరమ్మ వడివడిగా వెళ్ళిపోయెను.

మాతరమ్మ వెళ్ళిన గంట తరువాత కోడలు జయ ఏరోడ్డు మూలనో కూరుచుండి ఆఁకలి పోగొట్టుకొని కలకలలాడుచు యోగమాయ యెదుటికి వచ్చి దండము పెట్టి నిలువఁబడెను.

"గదిలో మీ బాబుగారున్నారు; ముందు వారికి దణ్ణము పెట్టవలెను" అని యోగమాయ యనెను.

జయ నోరు కఱచుకొని, తెఱచిన గుమ్మము ముందు వంగి నమస్కరించుచుండగా నాగరాజు వచ్చి చూచెను. మరల నదే చీర; మాతరమ్మ కట్టుకొనినదే;

అతని నోరినుండి గబగబ ఈ మాటలు దొరలెను - "ఇట్టి చీరలు మీ యింట నెన్ని కలవు?"

జయ భయపడెను. అత్తగారు చావనయిన చచ్చునుగాని దొంగతనము చేయదని జయకును దెలియును. అంత నామె భయము తొలఁగెను. పిదప ఇటులనెను - "అమ్మగారు పదిరోజులక్రింద మా యత్తగారి కీకోక ఇచ్చిరి. అదే అక్షయముగా నున్నది."

"మీ రిరువురును గలిసిరాక నీవు వెనుక వచ్చితివేమి?"

జయకు నవ్వును దుఃఖమును వచ్చెను. "అయ్యా! నే నిపుడు తమ సన్నిధానములో మనవి చేసికొనిన దదే. అందుల కనియే మే మిరువురమును మిల్లుపనిలోనికి రాజాల కున్నాము. ఆమె యొకరోజునను, నే నొకరోజునను వచ్చుచుందుము; అందువల్ల...."

జయ మాటలు విని నాగరాజు ఱిచ్చవడి పోయెను.

● *ఆంధ్ర పత్రిక* ●